ప్రభాత
తెలుగు దినపత్రిక
jayabheridaily.com

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 01
సంచిక : 82
పేజీలు : 4
వెల : 4

మల్కాజిగిరి
గురువారం, 05-10-2023


విలేకర్లు కావలెను

జయభేరి దినపత్రిక,
జయభేరి ఛానల్ లో
నిఖార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా ?
మీ కలాలకు పదును పెట్టండి....

ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com

9391 544 889 call me




# 10వ తేదీ ఎన్నికల షెడ్యూల్..?

2లో

తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ పదో తేదీన విడుదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేంద్రం ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్ బృందం ఇప్పటికే కసరత్తు పూర్తిచేసినట్టు సమాచారం. తెలంగాణతో పాటు రాజస్థాన్, మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రక్రియ ఏదైనా మిగిలి ఉంటే, ఈ నెల 10లోపు పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్టుగా తెలుస్తోంది. పాఠశాలల్లో దసరా రోజున ప్రారంభించాలను కున్న 'సీఎం అల్పాహార పథకం' ఈ నెల ఆరునే శ్రీకారం చుడుతున్నారు. అలాగే ఉద్యగులకు ఇతర వర్గాలకు పెండింగ్ హామీలు ఉంటే వారిని క్లియర్ చేయాలనుకుంటున్నారు. పీఆర్సీని నియమించి ఐదు శాతం ఐఆర్ కూడా ప్రకటించారు.


## శభాష్.. ప్లేయర్స్



✍ జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 4

చైనాలోని హాంగ్‌జౌ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత ప్లేయర్లు రాణిస్తున్నారు. సెప్టెంబర్ 23 నుంచి జరుగుతున్న ఈ క్రీడల్లో భారత ప్లేయర్లు ఇప్పటికే 16 గోల్డ్, 26 సిల్వర్, 31 బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు. అక్టోబర్ 8 వరకు జరిగే ఆసియా క్రీడల్లో మన ప్లేయర్లు మరిన్ని మెడల్స్ గెలిచే అవకాశం ఉంది. అయితే ఆసియా క్రీడల్లో భారత్ ఇన్ని మెడల్స్ గెలవడం ఇదే మొదటి సారి కావడం విశేషం. చివరిసారిగా భారత్ 2018 ఆసియా క్రీడల్లో 70 మెడల్స్ గెలుచుకుంది. ఇందులో 16 గోల్డ్, 23 సిల్వర్, 31 బ్రాంజ్ ఉన్నాయి. ఇలా గత రికార్డులను బ్రేక్ చేసి 70 ప్లస్ మెడల్స్‌ని భారత ప్లేయర్లు గెలిచిన సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. 'ఆసియా క్రీడల్లో భారత్ ముందెన్నడూ లేనివిధంగా ప్రకాశిస్తోంది. భారత్ సాధించిన 71 పతకాలు మన అథ్లెట్ల అసమానమైన అంకితభావం, క్రీడా స్ఫూర్తికి నిదర్శనం. ఇది భారత్‌కి అత్యుత్తమ మెడల్స్ గణాంకాలు. భారత్ గెలిచిన ప్రతి పతకం మన అథ్లెట్ల కృషి, అభిరుచి గురించి చాటిచెబుతోంది. ఇది యావత్ దేశం గర్వించదగ్గ క్షణం. భారత క్రీడాకారులకు అభినందనలు' అంటూ ప్రధాని మోదీ తెలిపారు.అలాగే అంతకముందు ఆసీయా క్రీడల్లో అర్చరీలో గోల్డ్ మెడల్స్ సాధించిన భారత ఆర్చర్లు ఓజాస్ డియోటాలే, జ్యోతి సురేఖ వెన్నమ్ జోడిని కూడా ప్రధాని మోదీ అభినందిస్తూ ట్వీట్ చేశారు. భారత ఆర్చర్ల అసాధారణ నైపుణ్యం, ఖచ్చితత్వం, కృషి కారణంగానే ఇలాంటి గొప్ప ఫలితం సాధ్యమైందని పేర్కొన్నారు.

## మహానటికి ఆస్కార్ ఇవ్వాలి



✍ జయభేరి, విజయవాడ, అక్టోబరు 4

ఏపీలో చంద్రబాబు అరెస్ట్‌తో మొదలైన రాజకీయం... మరింత వేడెక్కింది. సీఎం జగన్‌పై టీడీపీ నేతల ఆరోపణలను ఘాటుగా తిప్పికొట్టారు మంత్రి రోజా. టీడీపీ నేతలు కూడా రోజాపై అంతే ఘాటుగా విమర్శలు గుప్పించారు. అంతేకాదు... ఈ మాటల యుద్ధం.. ఇప్పుడు వ్యక్తిగత విమర్శల వరకు వెళ్లింది. టీడీపీ నేత బంగారు సత్యనారాయణమూర్తి మంత్రి రోజాపై వ్యక్తిగత దూషణలు చేశారు. ఆమె క్యారెక్టర్‌పై నిందలు వేశారు. పర్సనల్ వీడియోలు తన దగ్గర ఉన్నాయంటూ... అవి బయట పెడితే ఏమవుతుందో చూసుకోవాలంటూ హెచ్చరించారు. సీఎం జగన్‌ను కూడా ఆయన దూషించారు. ఈ రెండు ఘటనపై కేసులు నమోదు చేశారు పోలీసులు. బండారు సత్యనారాయణను అరెస్ట్ చేశారు. ఆయనకు మిగతా 2 లో

### పుసుపుబోర్డు, గిరిజన వర్శిటీతో పాటు కృష్ణా ట్రిబ్యూనల్ కూడా

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు !



✍ జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 4

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ లో ఇచ్చిన హామీ మేరకు నిజమాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో పసుపు బోర్డు నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. కేంద్ర కేబినెట్ నిర్ణయాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, కిషన్ రెడ్డి వెల్లడించారు. అలాగే తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని పాలమూరు సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. ప్రధాని ప్రకటించిన రెండ్రోజులకే గిరిజన వర్సిటీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం ఈ బిల్లుపై నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపింది. ములుగు జిల్లాలో రూ. 900 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ వర్సిటీకి గిరిజనుల ఆరాధ్యదైవమైన సమ్మక్క, సారక్క పేర్లను పెట్టారు. ఏపీ, తెలంగాణ కృష్ణా జలాల వివాదంపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణ మిగతా 2 లో

## సేమ్ 2 సేమ్... ఏపీలో మారని రాజకీయాలు

✍ జయభేరి, విజయవాడ, అక్టోబరు 4

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేసిన తర్వాత, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్ కేసులలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు కూడా సీఐడీ నోటీసులు ఇచ్చింది. లోకేశ్‌ని కూడా జైలుకు పంపించి... నాయకత్వ లేమీతో టీడీపీ శ్రేణులను నిరాశకు గురిచేయాలని వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది. నాయకుడు జైల్లో ఉంటే ఏమవుతుంది? గతంలో జగన్ జైల్లో ఉన్నప్పుడు ఏం జరిగిందో... ఇప్పుడూ అదే జరుగుతుంది. అప్పుడు దివంగత నేత రాజశేఖర్ రెడ్డి సతీమణి విజయమ్మ పాత్రను ఇప్పుడు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి, కూతురు షర్మిల పాత్రను ఆయన కోడలు బ్రాహ్మణి పోషిస్తున్నారు. ఈ రాజకీయాలలో మారేది పాత్రలే తప్ప కథ, స్క్రీన్‌ప్లే కాదు. చట్ట సభల్లో 33 శాతం మహిళల రిజర్వేషన్ అమలుకు ఇంకా సమయం పట్టవచ్చేమోగానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం దశాబ్దకాలంగా మహిళలే రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. దివంగత నేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మరణం తర్వాత ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠంపై ఆశలు పెట్టుకున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం సీనియర్ నేత రోశయ్యను, అనంతరం కిరణ్‌కుమార్ రెడ్డిని సీఎంగా చేయడంతో జగన్మోహన్‌రెడ్డి పార్టీ హైకమాండ్‌కు ఎదురుతిరిగారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి కుర్చీ దక్కదనే అంచనాతో 2010 నవంబర్ 29న ఎంపీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.2011 మార్చి 11న వైఎస్సార్సీపీ పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. పార్టీని బలోపేతం చేయడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్న క్రమంలో అక్రమంగా ఆస్తులు కూడగట్టారనే అభియోగంతో 2012 మే 27న జగన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసుకు సంబంధించి 16 నెలల పాటు జగన్ చంచల్‌గూడ జైలులో ఉన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత జైల్లో ఉన్నారు కాబట్టి పార్టీ మిగతా 2 లో




## 6న అల్పాహార పథకం ప్రారంభం

✍ జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 4

తెలంగాణలో మరో కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈనెల 6వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం తీసుకొస్తున్నారు. దీన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని సీఎస్ శాంతి కుమారి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయం నుంచి కలెక్టర్లతో, సంబంధిత కార్యదర్శులతో, ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో నుంచి ఒక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎంపిక చేసి అల్పాహార ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు, స్థానిక సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ అధికారికంగా రంగారెడ్డి జిల్లాలో ప్రారంభిస్తారని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఇందుకోసం ప్రతీ సంవత్సరం 400 కోట్ల రూపాయలను ఖర్చు చేయనుంది ప్రభుత్వం. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ స్కూల్స్, మోడల్ స్కూల్స్‌లోని మొత్తం 23,05,801 మంది విద్యార్థులకు 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకం అమలు



చేయనున్నారు. నీరసం, రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలు విద్యార్థులను బాధిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వం గుర్తించి ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల చదువుల పట్ల ఏకాగ్రత పెంచటం, కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులకు ఇబ్బంది కలగకూడదన్న ద్విముఖ వ్యూహంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెడుతుంది. సన్నబియ్యం, రాగిజావ, మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు/అరటి పండు వంటివి అందించబోతున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసుల సమయంలో స్నాక్స్‌ను అందజేస్తుండగా, తాజాగా సుపోషణలో భాగంగా బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయనున్నది.



## సంచిలో చుట్టుకుని వెళ్లింది

✍ జయభేరి, గుంటూరు, అక్టోబరు 4

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరు రోజుల శిశువు అపహరణకు గురవ్వడం కలకలం రేపుతోంది. తల్లి పక్కలో ఉన్న పసి పాపను గుర్తు తెలియని మహిళ అపహరించుకెళ్లింది. గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు ఐపిడి కాలనీకి చెందిన రబ్బానీ భార్య రోష్నిని డెలివరీ కోసం గత నెల 26వ తేదిన జిజిహెచ్‌లో చేర్పించాడు. 27వ తేదిన ఆమెకు సిజేరియన్ చేయగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మంగళవారం మధ్యాహ్నం మహిళ.. భర్త ఆహారం తీసుకువచ్చేందుకు బయటకు వెళ్లాడు. ఈ సమయంలో తల్లి పక్కలో పసిపాప ఉంది. తల్లి నిద్రపోవటాన్ని గమనించిన మహిళ తల్లి పక్కలో ఉన్న శిశువును ఎత్తుకెళ్లింది. మేల్కొన్న తల్లి పక్కలో శిశువు లేకపోవడాన్ని గమనించి వెంటనే భర్తకు చెప్పింది. భార్య భర్తలు వెంటనే కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.రంగంలోకి దిగిన పోలీసులు జిజిహెచ్‌లో సిసి కెమెరా విజువల్స్ పరిశీలించగా.. గుర్తు తెలియని మహిళ పసిపాపను తీసుకెళ్ళినట్లు గుర్తించారు. ఓ మధ్యవయస్కురాలు పసికందును తీసుకుని ఆటో రిక్షాలో వెళ్లినట్లు గుర్తించారు. జీజీహెచ్ నుంచి బయటకు వెళ్ళే సమయంలో అనుమానం రాకుండా మహిళ బిడ్డను సంచిలో పెట్టుకుంది. ఆటోను ట్రాక్ చేసి.. మహిళను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రభాత జయభేరి
jayabheridaily.com

# 10వ తేదీ ఎన్నికల షెడ్యూల్..?

✍ జయభేరి, హైదరాబాద్, అక్టోబరు4




తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ పదో తేదీన విడుదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేంద్రం ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్ బృందం ఇప్పటికే కసరత్తు పూర్తిచేసినట్టు సమాచారం. తెలంగాణతో పాటు రాజస్థాన్, మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రక్రియ ఏదైనా మిగిలి ఉంటే, ఈ నెల 10లోపు పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్టుగా తెలుస్తోంది. పాఠశాలల్లో దసరా రోజున ప్రారంభించాలనుకున్న 'సీఎం అల్పాహార పథకం' ఈ నెల ఆరునే శ్రీకారం చుడుతున్నారు. అలాగే ఉద్యగులకు ఇతర వర్గాలకు పెండింగ్ హామీలు ఉంటే వారిని క్లియర్ చేయాలనుకుంటున్నారు. పీఆర్సీని నియమించి ఐదు శాతం ఐఆర్ కూడా ప్రకటించారు. మరిన్ని పథకాలను అమలు చేయబోతున్నారు. మేనిఫెస్టో .. విపక్షాలకు మైండ్ బ్లాంక్ అయ్యేలా ఉంటుందని హరీష్ రావు చెబుతున్నారు. ఐదు రాష్ట్రాలకు ఒకేసారి షెడ్యూల్ విడుదల చేసేందుకు కేంద్రం ఎన్నికల సంఘం సమాయత్తమైంది. తెలంగాణకు వచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ సారథ్యంలోని 17 మంది అధికారుల బందం హోటల్ తాజ్‌కష్ణాలో బసచేసింది. అక్కడే సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నది. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో సమావేశం కానుంది. కాగా, సీఈసీ బందం రాకతో అతిత్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నట్టు స్పష్టమైంది. సీఈసీ బందంలోని అధికారులు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, సన్నద్ధతపై ఎన్నికల నిర్వహణ అధికారులు, సంస్థలతో సమీక్షిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశమవుతున్నారు. ప్రభుత్వపరంగా అందిస్తున్న సహకారంపై చర్చించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతోనూ ఈ బందం ప్రత్యేకంగా సమావేశమవుతుంది. మరో వైపు రాజకీయ పార్టీల నేతలు హైదరాబాద్‌లో సీఈసీ బృందాన్ని కలిసి.. పలు అంశాలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలను తీసుకొచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుందని దీన్ని అరికట్టాలని కోరారు. హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నాయనీ, వాటిపై సీరియస్‌గా వ్యవహరించాలని అన్ని పార్టీల నేతలు విజ్ఞప్తి చేశారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## మహానటికి ఆస్కార్ ఇవ్వాలి

బెయిల్ వచ్చింది. అయితే... బండారు వ్యాఖ్యలపై తీవ్ర మనస్తాపం చెందిన మంత్రి రోజా... నిన్న మీడియా ముందు కంటతడి పెట్టుకున్నారు. ఒక మహిళా మంత్రిని నీచంగా మాట్లాడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని కన్నీరు పెట్టుకున్నారు. మంత్రి రోజా కన్నీరుపెట్టుకోవడంపై కూడా టీడీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మంత్రి రోజా లాంటి మహానటిని చూస్తే నవ్వు వస్తోందన్నారు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత. అసభ్య పదజాలానికి కేరాఫ్ అడ్రెస్సే రోజా అని విమర్శించారామె. మహిళలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడే నీచ సంస్కృతికి తీసుకొచ్చిందే రోజా అని ఆరోపించారు అనిత. అసెంబ్లీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై ఆమె చేసిన విమర్శల వీడియోలను మీడియా ముందు ప్లే చేసి వినిపించారు. అసెంబ్లీలో టీడీపీ అధినేత చంద్రబాబుని కామ సీఎం అంటూ వ్యాఖ్యలు చేశారనే మాట వాస్తవం కాదా అని నిలదీశారు. ఆనాడు మహిళ అనే విషయం రోజాకు గుర్తులేదా అని ప్రశ్నించారు. మంత్రి రోజాను ఏదో అన్నారని.. తమ పార్టీ నాయకుడు బండారు సత్యనారాయణను ఉగ్రవాదిని అరెస్ట్ చేసినట్టు... 200 మంది పోలీసులను పెట్టి లాక్కెళ్లారని ఆరోపించారు. నాలుగున్నర ఏళ్లలో లక్షా 20వేల మంది మహిళలు, ఆడపిల్లల వేధింపులకు గురైతే మంత్రి రోజా బాధలేదా... అప్పుడు ఎందుకు మాట్లాడలేదని గట్టిగా నిలదీశారు టీడీపీ నేత అనిత. మద్యపానం నిషేధం పేరు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేయలేదా అని ప్రశ్నించారు. రోజాకు రాజకీయ భిక్ష పెట్టిందే చంద్రబాబు అని... అలాంటి నాయకుడిపై నోటికొచ్చిన విమర్శలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలని అని ప్రశ్నించారు అనిత. బండారు సతీమణి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి... ఫిర్యాదు చేస్తే కనీసం రసీదు కూడా ఇవ్వలేదని అనిత ఆరోపించారు. సీఎం జగన్ సతీమణి భారతిరెడ్డి గురించి ఒక్కమాట మాట్లాడితే నిమిషాల్లో పోలీసులు ఇళ్లకు వస్తారని మండిపడ్డారు. టీడీపీ మహిళా నేతలపై అసభ్యంగా మాట్లాడితే వారిపై కేసులు ఉండవా? మా ఫిర్యాదులపై ఇప్పటి వరకు విచారణ జరగలేదని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆవేదన వ్యక్తం చేశారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు !

వాటాలు తేల్చాలని ట్రైబ్యునల్ కు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. కొత్త నిబంధనలు రూపొందించాలని ట్రైబ్యునల్ ను కేంద్రం ఆదేశించింది. కృష్ణా జలాల్లో తమ వాటా తేల్చాలని తెలంగాణ కోరుతున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. దీంతో ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల వివాదం కొలిక్కిరానుంది. కొంత కాలంగా బీఆర్ఎస్ పార్టీ చీఫ్, సీఎం కేసీఆర్ బీజేపీపై తెలంగాణ విషయంలో ఈ మూడు అంశాల్లోనే తీవ్ర విమర్శలు చేస్తూ ఉంటారు. పసుపు బోర్డు హామీ.. బీజేపీ చాలా సార్లు ఇచ్చింది. గత ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసిన ధర్మపురి అర్వింద్ బీజేపీని గెలిపిస్తే పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని రైతులకు బాండ్ కూడా రాసిచ్చారు. గిరిజన వర్సిటీ చాలా కాలంగా పెండింగ్ లో ఉంది. ఇది విభజన చట్టంలలో హామీ. ఎన్నికలకు వెళ్లే ముందు ఈ హామీని నెరవేరస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకం జరగాల్సి ఉంది. 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విడిపోయాయి. ఉమ్మడి రాష్ట్రానికి ముందు నుంచి ఉన్న 811 టీఎంసీల నీటిని రెండు రాష్ట్రాలు పంచుకున్నాయి. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు అనుకున్నారు. ఇది తాత్కాలిక సర్దుబాటు మాత్రమే. ఇది కేవలం ఒప్పందం మాత్రమే. తీర్పు కాదు. ఈ బోర్డే నీటిని పంచుతోంది. అయితే విడిపోయిన తరువాత నీటి పంపకాలు కూడా కొత్తగా చేపట్టాలని తెలంగాణ కోరింది. అంతకుముందు తీర్పుల సమయంలో తెలంగాణలేదు కాబట్టి, తెలంగాణ వాదన వినేలా కొత్త ట్రిబ్యునల్ కావాలని తెలంగాణ వాదించింది. అందుకోసం కొత్తగా ట్రిబ్యునల్ వేయాలని 2014లో కేంద్రానికి లేఖ రాసింది తెలంగాణ ప్రభుత్వం. లేదంటే ఉన్న ట్రిబ్యునలే కొత్తగా నీటి పంపకాలు చేయాలని డిమాండ్ చేసింది. ఇప్పుడా డిమాండ్ ను అంగీకరించి కేంద్రం కొత్త ట్రిబ్యూనల్ ఏర్పాటు చేసింది.



## పోలీస్ కమీషనరేట్ నూతన కార్యాలయం భూమి పూజకు ఏర్పాట్లు

✍ జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్ నూతన కార్యాలయం భూమి పూజ/శంకుస్థాపన కార్యక్రమానికి మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ, కార్మిక &ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, రాచకొండ పోలీస్ కమీషనర్ DS చౌహన్ IPS విచ్చేయుచున్న సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డీసీపీ గిరిధర్, డీసీపీ శ్యామ్ సుందర్ రావు కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఇస్లావత్ నమ్మ, AE బిక్షపతి, కార్పొరేటర్ మద్ది యుగేందర్ రెడ్డి, నాయకులు ఈశ్వర్ రెడ్డి, ఏసిపి ఆకుల శ్రీనివాస్, మేడిపల్లి సిఐ సైదులు, ఇతర పోలీస్ అధికారులు అధికారులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

✍ జయభేరి, అక్టోబర్ 4 :

మరమ్మత్తుల కారణంగా లక్ష్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో నేడు గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అలియా బాద్ సబ్ స్టేషన్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు 33/11 kv లక్ష్మాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లలో మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## ఉప్పల్ లో వంద పడకల ఆస్పత్రి మంజూరు.. హర్షం వ్యక్తం చేసిన కార్పొరేటర్ బన్నాల

✍ జయభేరి, ఉప్పల్ :



కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, బిఎల్ఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్. ఉప్పల్లో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయడంతో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ చిల్కానగర్ చౌరస్తాలో కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావు, బిఎల్ఆర్ ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. గత ప్రభుత్వాల హయాంలో ఉప్పల్ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యరంగా నేను నిర్లక్ష్యం చేశారని తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ సామాన్యులకు మెరుగైన వైద్యం అందుబాటులో తీసుకురావాలని ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి బస్తీకి దవఖాన ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సదుపాయాన్ని అందుబాటులో తీసుకువచ్చారని అన్నారు. పేద ప్రజలు, కార్మికులు మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా నివసించే ఉప్పల్ లో మంత్రి హరీష్‌రావు, ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి చొరవతో 100 పడకల ఆసుపత్రి మంజూరు చేశారని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు, అభ్యర్థి బిఎల్ఆర్ ప్రత్యేక ధన్యవాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, వీబీ నరసింహ, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, పండ్ల కిషన్ గౌడ్, బాణాల నారాయణరెడ్డి, అల్లిబిల్లి మహేందర్, పార్నంది నర్సింగరావు, రామానుజం, బింగి శ్రీనివాస్, యాదగిరి, అశోక్ చారి, రమేష్, రామచందర్, కృష్ణ, సదానంద్, ఉపేందర్, సుందర్, యాదిరెడ్డి, పోచయ్య, ఎండి షఫీ, ఎండి గౌస్, ఎండీ హనీఫ్, సయ్యద్ అమీర్, ఎస్కే షఫీ, చాంద్ పాషా, సల్లా జాలయ్య, లక్ష్మీనారాయణ చారి, ఈ నరసింహ చారి, సంతోష్, శ్రీశైలం, అశోక్, నవీచంద్, సుధాకర్, మహిళా అధ్యక్షులు సుభద్ర, శాహనాజ్, ఆండాలు, లక్ష్మి, సత్యవతి, ఉమ, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ నియోజకవర్గం ప్రజల దౌర్భాగ్యం మల్లారెడ్డిని గెలిపించుకోవడం

**దేవాలయాలకు సిసి రోడ్ల కు ఇచ్చిన విలువ. పాఠశాలలకు ఇవ్వని మంత్రి మల్లారెడ్డి. ప్రభుత్వ పాఠశాల పట్టించుకోని మంత్రి మల్లారెడ్డి.. పేదల పట్ల ఎందుకు వివక్ష పాఠశాల చుట్టూరా చెట్లు మురికి నీరు నిల్వ ఉండటం వల్ల పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది.**

✍ జయభేరి, అక్టోబర్4 :



మేడ్చల్ జిల్లా, శామీర్ పేట్ మండల, పరిధిలోగల బొమ్మరాసిపేట గ్రామంలో పాఠశాల దుస్థితి చాలా దారుణంగా ఉందని ఆ పాఠశాలను ఏ అధికారి కూడా వచ్చి ఇప్పటివరకు సందర్శించిందే లేదు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజల దౌర్భాగ్యం మల్లారెడ్డిని గెలిపించుకోవడం. మల్లారెడ్డి దేవాలయాలకు సిసి రోడ్లకు ఇచ్చిన విలువ ప్రభుత్వ పాఠశాలలకు విలువ ఇవ్వడం లేదు మంత్రి మల్లారెడ్డి. పేదల పిల్లలు చదువుకోవడానికి ప్రభుత్వ పాఠశాలలకు వెళుతుండగా ఆ పాఠశాల లో ఎలాంటి వసతులు కల్పించకపోగా. ప్రదేశం లో మురికి నీటితో నిండిపోవడం చెట్లు పెరిగిపోవడం వల్ల పిల్లల ప్రాణాలకు ప్రమాదం జరిగే సూచనలు ఉన్నప్పటికీ. మురికి నీరు ఒకే దగ్గర నిల్వ ఉండటం వల్ల పిల్లలు అనారోగ్యం పలు అయ్యే అవకాశం ఉన్నదని తెలిసి కూడా నిమ్మకు నేరెత్తనట్టుగా వ్యవహరిస్తున్న గ్రామ సర్పంచ్. పాఠశాల చుట్టూరా పెద్ద పెద్ద చెట్లు పెరగటంతో అందులో పాములు సంచరించే ప్రమాదం అందువల్ల పిల్లల ప్రాణాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని గ్రామస్తులు గ్రామపంచాయతీలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదు అని వాపోయారు. దేవాలయాలు కట్టిస్తే మార్పు వస్తుందని తెలిస్తే. ప్రపంచవ్యాప్తంగా దేవాలయాలని కట్టించేవారు. వాటి వల్ల ఎలాంటి మార్పు జరగదు అని తెలిసి. ఒక మనిషి ఎదగాలన్న జీవితంలో ఉన్నత స్థాయికి పోవడానికి మనిషికి కావాల్సిందల్లా మంచి చదువు దానికి కావలసిన అన్ని వసతులను సౌకర్యాలను ఏర్పాటు చేయడం. ఆ విషయం మరిచిన రాజకీయ నాయకులు వారి స్వార్థపూరిత రాజకీయాల కోసం గుడిలు ఏర్పాటు చేయడం పనికిరాని కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. యువత కావాల్సింది ముఖ్యంగా విద్య ఆ విద్యను రోడ్డుపాలు చేస్తున్నారు. తెలంగాణ రాజకీయ నాయకులు విద్య అనేది ప్రైవేట్ పరం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి నీకు మంచి విద్య అందాల డబ్బులు పెట్టు డబ్బులతోటే విద్య అనే విధంగా మల్లారెడ్డి ధోరణి నడుస్తుంది. ఆయనకు నియోజకవర్గ ప్రజల మీద ఏమాత్రం చిత్తశుద్ధి లేదు అని స్పష్టంగా అర్థం అవుతుందని గ్రామస్తులు మల్లారెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి మలరెడ్డి ఎన్నో సభలలో చెప్తూనే ఉన్నాడు. నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయి ఆస్తులు ఉన్నాయి. నేను రాజకీయాల్లోకి వచ్చింది సంపాదించుకోవడానికి కాదు ప్రజలకు సేవ చేయడానికి వచ్చాను ఆ మాటలు నోటికే అంకితం అయ్యాయా? చేతల్లో చేసి చూపిస్తున్నాడా అని ప్రశ్నిస్తున్నారు? గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. విద్యార్థులు భావితరాలకు బాటలు వేసుకునే పాఠశాలలను పట్టించుకోకుండా నీవు పేద ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తావు. అని మంత్రిని ప్రశ్నిస్తున్నారు గ్రామస్తులు. ఇప్పటికైనా నీకు నియోజకవర్గ ప్రజల మీద ప్రేమ ఉంటే ముందు దేవాలయాలు నిర్మించడం కాదు అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ పాఠశాలలన్నిటిని మార్చు అప్పుడు చెప్పు నీకు నియోజకవర్గ ప్రజల మీద ప్రేమ ఉన్నదని చివాట్లు పెట్టారు గ్రామస్తులు.



## మంత్రి హరీష్ రావు కు బిఎల్ఆర్ కృతజ్ఞతలు



మంత్రి తన్నీరు హరీష్ రావు ని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన బిఎల్ఆర్. గత కొన్ని సంవత్సరాలుగా ఉప్పల్ ప్రజలు ఎదురుచూస్తున్న 100 పడకల ఆసుపత్రి ఎట్టకేలకు ఏర్పాటుకు GO రావడంతో ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో BRS రాష్ట్ర కార్యదర్శి, MBC మాజీ చైర్మెన్ తాడూరు శ్రీనివాస్, మీర్ పేట్ HB కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామరావు, డివిజన్ ప్రెసిడెంట్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## సేమ్ 2 సేమ్...

చచ్చిపోతుందని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావించింది. కానీ అందుకు భిన్నంగా ఈ చర్యలే వైఎస్ఆర్‌సీపీ పునాదులు బలపడడానికి కారణాలయ్యాయి. జగన్మోహన్‌రెడ్డి తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల రాజకీయ రంగప్రవేశానికి తలుపులు తెరుచుకున్నాయి. తనకు తాను 'జగనన్న వదిలిన బాణం' అని ప్రకటించుకున్న ఆమె 3 వేల కిలోమీటర్ల భారీ పాదయాత్ర చేసి కష్టకాలంలో వైఎస్సార్సీపీని ఒడ్డున పడేశారు. 16 జిల్లాల్లో చేపట్టిన ఈ పాదయాత్రలో కోటి మందికి పైగా జనాలను షర్మిల ప్రత్యక్ష్యంగా కలిసినట్లు అంచనా. 2013 సెప్టెంబర్‌లో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జగన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసే వరకూ షర్మిల పార్టీ కార్యక్రమాల్ని నిరాటంకంగా నడిపించారు. మరోవైపు విజయమ్మ అసెంబ్లీ సాక్షిగా ప్రజా సమస్యలను లేవనెత్తి ప్రజల మనుసులను చూరగొనడనంతోపాటు పార్టీని బతికించారు, నిలబెట్టారు. విజయమ్మ సమైక్యాంధ్ర ఉద్యమంలో కూడా క్రియాశీల పాత్ర పోషించారు. వైఎస్సార్సీపీని తమ శక్తియుక్తులతో మండే అగ్నిగోళంలా తయారు చేసిన ఘనత ఈ తల్లీ కూతుళ్లకే దక్కుతుంది. ఆ తర్వాత జగన్ ప్రతిపక్ష నేత కావడం, ముఖ్యమంత్రి కావడంలో వీరిద్దరి పాత్ర వెలకట్టలేనిది. గతంలో జగన్ జైలు పాలయినప్పుడు తల్లీ కూతుళ్లు పార్టీ పటిష్టతకు కష్టపడితే, మరోవైపు జగన్ సతీమణి వైఎస్.భారతీ న్యాయ పోరాటంలో ఆయనకు బాసటగా నిలిచారు. జగన్ జైలు పాలయినప్పుడు కొణతాల రామకృష్ణ, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శోభనాగిరెడ్డి, మైసూరారెడ్డి, సోమయాజులు, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి సీనియర్ నేతలు పొలిటికల్ అఫైర్స్ కమిటీని ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అరెస్టు కావడంతో టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉన్న యనమల రామకృష్ణ, అశోక్ గజపతిరాజు, బుచ్చయ్య చౌదరి, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, రామ్మోహన్‌నాయుడు, బాలకృష్ణ వంటి సీనియర్ నేతలు పొలిటికల్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి పార్టీలో ఉత్సాహాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నారు. గతంలో జగన్‌పై కేసుల సందర్భంగా సీబీఐ సంస్థను కేంద్ర ప్రభుత్వం చేతిలో పంజరం అనే ఆరోపణలొస్తే, ఇప్పుడు చంద్రబాబు అరెస్టు తర్వాత సీఐడీని రాష్ట్ర ప్రభుత్వం చేతిలో పంజరం అంటూ అవే రకమైన విమర్శలు వెలువడుతున్నాయంటే అప్పటి నాటకం మళ్లీ ఇప్పుడు తిరిగి ప్రారంభమైందని చెప్పవచ్చు. 2014కి ముందు వైఎస్.విజయమ్మ, షర్మిలా ఏ స్థానంలో ఉన్నారో ఇప్పుడు భువనేశ్వరి, బ్రాహ్మణి కూడా ఆ పాత్రలనే పోషిస్తున్నారు. కూలిపోతుందనుకున్న వైఎస్ఆర్‌సీపీని విజయమ్మ, షర్మిలా ఏ విధంగా తమ భుజాలకెత్తుకున్నారో, ఇప్పుడు అదే పరిస్థితుల్లో ఉన్న టీడీపీని నిలబెట్టడానికి భువనేశ్వరి, బ్రాహ్మణి కూడా రంగంలోకి దిగారు. అంతేకాక ఈ నలుగురి మధ్య కొన్ని పోలికలు ఉన్నాయి. యువ వ్యాపారవేత్తగా విజయవంతంగా రాణిస్తున్న నారా బ్రాహ్మణి త్వరలో రాజకీయ రంగప్రవేశం చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్ పూర్తిచేసిన నారా బ్రాహ్మణి, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తూ ఆ సంస్థను ఉన్నత స్థానానికి తీసుకెళ్లడంలో కృషిచేశారు. చంద్రబాబు అరెస్టు తర్వాత కష్టాల్లో ఉన్న పార్టీ బాధ్యతను కూడా ఆమె తన భుజాన వేసుకునేందుకు సిద్ధమయ్యారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన 'సత్యమేవ జయతే' పేరుతో నిరాహార దీక్షలను భువనేశ్వరి, బ్రాహ్మణి ఆధ్వర్యంలో తెలుగుదేశం పెద్దఎత్తున చేపట్టింది. ఇలాంటి నిరసనలనే గతంలో విజయమ్మ కూడా చేపట్టారు.



## ఐ.ఆర్ 20శాతానికి పెంచాలి

### సైరెడ్డి లక్ష్మికాంత్ రెడ్డి

✍ జయభేరి, మేడిపల్లి :

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన మధ్యంతర భృతిని ఐదుశాతం నుండి ఇరవై శాతానికి పెంచాలని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(టి.ఎస్.పి.టి.ఎ)మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి సైరెడ్డి లక్ష్మికాంత్ రెడ్డి డిమాండ్ చేసారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐ.ఆర్ పట్ల ఉపాధ్యాయ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని ఆయన అన్నారు. ఐ.ఆర్ ను 20శాతానికి పెంచటంతో పాటు, ఇప్పటికే పెండింగ్ లో ఉన్న మూడు డి.ఏ లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్మికాంత్ రెడ్డి కోరారు.


# భరోసా అంటే బండారి.. లక్ష్మారెడ్డి అంటే బాధ్యత...

# మనం ఏం కావాలో అడగకుండానే అన్ని చేస్తుండు

**జయభేరి, ఉప్పల్, నాచారం :**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి శాంతి సాయిజెన్ శేఖర్ అధ్యక్షతన నాచారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి నాచారం డివిజన్ ముఖ్యనాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలతో కూడిన ఆత్మీయ సమ్మేళనం సభను నిర్వహించడం జరిగింది. ఈ సభకు మాజీ ఎంబీసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఉప్పల్ నియోజకవర్గ పలువురు డివిజన్ కార్పొరేటర్లు, పలువురు ముఖ్యనాయకులు, పలువురు డివిజన్ అధ్యక్షులు, పలువురు బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాచారం డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి శాంతి సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ... బండారి లక్ష్మారెడ్డి ని ఆదర్శంగా తీసుకొని 2010 నుండి ఆయన అడుగులో అడుగై నడుస్తున్న. ఉప్పల్ నియోజకవర్గానికి 100పడకల ఆసుపత్రిని తీసుకొచ్చిన పెద్దలు బండారి లక్ష్మారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు. బండారి లాక్ష్మా రెడ్డి నిజాయితీ కలిగిన నాయకుడు. మాట ఇస్తే తప్పడు.. మడమ తిప్పడు.. ఎంత జఠిలమైన సమస్య వచ్చినా సరే దాన్ని పరిష్కరించే శక్తి ఉన్న వ్యక్తి. ఎవ్వరికి ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్ తో పరిష్కరించే దమ్మున్న నాయకుడు. పేద ప్రజలకోసం ఎంతైనా దానం చేసే కలియుగ కర్ణుడు మా లక్ష్మారెడ్డి అన్న. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తని గుర్తుపట్టి పేరుతో పిలుస్తారు. గతంలో ఎమ్మెల్యే ని కలవాలంటే కలవలేని పరిస్థితి ఉండేది కానీ ఇప్పుడు బండారి లక్ష్మారెడ్డి ని నేరుగా మనమే కలిసి మన సమస్యకు పరిష్కారం పొందొచ్చు. ఎమ్మెల్యే కాకముందే, ప్రచారం చెయ్యకుండానే 100పడకల హాస్పిటల్ తీసుకొచ్చిన దిల్ దార్ మనిషి మా లక్ష్మారెడ్డి అన్న. నిస్వార్థంగా పేద ప్రజలకోసం బిఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా వేల మందికి ఆర్థికంగా సహాయం చేస్తూ... పేద ప్రజల పక్షాన నిలిచిన నాయకుడే మన ఉప్పల్ నుండి ప్రాతినిధ్యం వహించడం మనందరి అదృష్టం.. ఇంత నిజాయితీగా పేదల కష్టాలు తీర్చే నాయకుడిని మనందరం అత్యంత భారీ మెజారిటీతో గెలిపించుకొని ఉప్పల్ నియోజకవర్గాన్ని తెలంగాణ లోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలని తీర్మానం చేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎంబిసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... బండారి లక్ష్మారెడ్డి ఆత్మీయ సమ్మేళన సభను భారీ సక్సెస్ చేసిన బియారెస్ కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు. ఉప్పల్ లో మన బ్రతుకు చిత్రాన్ని మార్చే సత్తా ఉన్న ఏకైక నాయకుడు మన బండారి లక్ష్మారెడ్డి. మనం రెండు నెలలు తనకోసం కష్టపడితే చాలు.. మనకోసం వచ్చే 5 యేండ్లు నిరంతరం సేవ చేసే నాయకుడు బండారి లక్ష్మారెడ్డి. కేసీఆర్ చేపించిన సర్వే లో ఉప్పల్ ప్రజల ఆషాకిరణం బండారి లక్ష్మారెడ్డి అని తేటతెల్లం అవ్వడంతో పిలిచి మరీ టికెట్ ఇచ్చారు. ఇంతటి ప్రజాదరణ కలిగిన నాయకుడితో కలిసి పని చేయ్యాలని నిత్యం అనుకునే వాడిని, ఇప్పుడు కలిసి పనిచెసే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. కొందరి నాయకుల్లాగా మాటలు చెప్పడు..




ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ--- ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే ఆవకాశం ఇచ్చిన కేసీఆర్ కి ధన్యవాదాలు. నాకు టికెట్ వచ్చి దాదాపు నెలన్నర అయ్యింది. 20 రోజుల క్రితమే ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ఇండస్ట్రియల్ భూముల్ని కేటీఆర్ సహకారంతో రెసిడెన్షియల్ జోన్ లోకి తీసుకువచ్చాను. గత 3నెలలుగా కేసీఆర్ కి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తూ 100 పడకల ఆసుపత్రిని నిన్ననే మంజూరు చేపించాను. కొన్ని రోజుల్లోనే కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలతో కూడిన అధునాతన హాస్పిటల్ అందుబాటులోకి రానుంది. ఉప్పల్ నియోజకవర్గానికి ఒక జూనియర్ కాలేజ్, ఒక డిగ్రీ కాలేజ్ తీసుకొస్తాను. ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తాను. ఎర్రకుంట చెరువును మోడరన్ లేక్ గా మార్చి అందరూ వాకింగ్ చేసే విధంగా వాకింగ్ ట్రాక్ వేపిస్తాను. నాచారంలో దోమలు బెడద లేకుండా చేస్తాను. ఉప్పల్ నియోజకవర్గానికి పలుచోట్ల ఓపన్ జిమ్స్ ఏర్పాటు చేస్తాను. ఉప్పల్ లో ఎవరైనా పేద విద్యార్థులు ఎంబీబీఎస్ సిటు సాధించి వారు ఫీజ్ కట్టలేని పరిస్థితిలో ఉంటే నాకు చెప్పండి నేను వారికి సహాయం చేస్తాను. ఉప్పల్ నియోజకవర్గంలో మీ అందరికీ ఎక్కడ ఏ సమస్య వచ్చినా నేరుగా నన్నే కలవండి. ఉప్పల్ ప్రజలకు నిస్వార్థంగా సేవ చెయ్యాలనే దృక్పథంతో నేను మీ ముందుకు వచ్చాను. మీరు నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపిస్తే, వచ్చే 5యేండ్లు మీకు ఇంటిమనిషిలా పనిచేసి మీ ఋణం తీర్చుకుంటానన్నారు.



నిజాయితీగా నిబద్ధతతో పనులు చేసి చూపిస్తాడు. ఇలాంటి నిబద్దత కలిగిన నాయకుడికి మనందరం అండగా నిలబడాలి, భారీ మెజారిటీతో గెలిపించుకుని మన భవిష్యత్ ని మనమే రాసుకోవాలి.

ఈ సందర్భంగా మీర్ పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య మాట్లాడుతూ--- భరోసా అంటే బండారి... లక్ష్మారెడ్డి అంటే బాధ్యత... మనం ఏం కావాలో అడగకుండానే అన్ని చేస్తుండు బండారి లక్ష్మారెడ్డి. లచ్చన్న రావడం రావడంతోనే 100పడకల ఆసుపత్రి తీసుకొచ్చాడు.. ఇలా ఇంతవరకు ఏ నాయకుడు చెయ్యలేదు, చెయ్యలేరు. మనకు తిండి పెట్టె నాయకుడు, మనకు ఏ కష్టమొచ్చినా తక్షణమే స్పందించి పరిష్కరించే గొప్ప వ్యక్తి బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కై అధిష్టానం పంపినటువంటి దూత బండారి లక్ష్మారెడ్డి. బిఆర్ఎస్ పార్టీ నిర్ణయమే మాకు ఫైనల్.. బండారి లక్ష్మారెడ్డి మన ఎమ్మెల్యే. బండారి లక్ష్మారెడ్డి నీ ఆదర్శంగా తీసుకొని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ దంపతులు నిత్యం కష్టపడుతూ నాచారం డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతున్నారు. ఇలాంటి గొప్ప నాయకుడిని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ కలిసి పెద్దఎత్తున ప్రచారం చేసి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ సారె : మంత్రి మల్లారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, అక్టోబర్ 4 :**

తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ పండుగకు కానుకగా ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలు సారె గా అందిస్తున్నారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం శామిర్ పేట్, మూడుచింతలపల్లి మండలాలలో మహిళలకు బతుకమ్మ చీరలతో పాటు గ్రామ పం చాయితీలకు కేసీఆర్ క్రికెట్ కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ---సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని రాష్ట్రంలోని ఆడపడుచుల కండ్లలో సంతోషం నింపడమే. లక్ష్యంగా సీఎం కేసీఆర్ తన పాలన సాగిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక కేసీఆర్ నేతృత్వంలో కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను గౌరవిస్తూ ప్రభుత్వం అందరికి అండగా నిలుస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి పదకాలు లేవని దేశం గర్వించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు దాసరి ఎల్లు బాయ్ బాబు, హారికమురళి గౌడ్, శామిర్ పేట్ మండల అధ్యక్షుడు సుదర్శన్, ఎంపీడీవో వత్సలాదేవి, సూపర్డెంట్ సంపత్, ఎంపివో లు సునిత, మంగతాయారు, సర్పంచులు, ఎంపిటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం చేపట్టిన గృహలక్ష్మి పథకం క్రింద అర్హులైన లబ్ధిదారులకు కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ నగర మేయర్ సాముల బుచ్చిరెడ్డి, 5 డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**





తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బతుకమ్మ చీరల పంపిణి కార్యక్రమాన్ని బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని బొమ్మక్ బాలయ్య ఫంక్షన్ హాల్లో మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీమతి కొత్త లక్ష్మి రవి గౌడ్ 5 డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని బతుకమ్మ చీరలు లబ్దిదారులకు పంపిణి చేసారు.

**జయభేరి, మేడిపల్లి**



## శామిర్ పేట్ చెరువులో మృతదేహం లభ్యం

**జయభేరి, అక్టోబర్4 :**

శామీర్ పేట్ చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. ఈ సంఘటన బుధవారం శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం. ప్రకారం వివరాలు... శామీర్ పేట్ చెరువు వద్ద టీఎస్ 04 ఈజెడ్ 3132 నెంబర్ గల బైక్, బైక్లో సెల్ ఫోన్ కనిపించాయి. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పరిసర ప్రాంతాలను వెతికిచూసి పోలీసులకు సహాచారం అందించారు. కాగా బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో చెరువులో తేలియాడుతు వికతజీవిగా వ్యక్తి కనిపించాడు. నీటి ఒడ్డుకు తీసుకువచ్చి శవపంచనామా నిర్వహించారు. మృతుడి మరణానికి కారణం తెలియరాలేదని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. మృతుడు ఖమ్మం జిల్లా తలనాడు మండలంలోని బిళ్ళపూడి గ్రామానికి చెందిన పనేని కార్తీక్(29) సుమన్ టీవీలో కెమెరా రామెన్ గా పనిచేస్తు హైదరాబాద్ ఫిలిమ్ నగర్ లో ఫైర్ స్టేషన్ ఎదురుగా నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు వివరించారు.



## మృతురాలి కుటుంబానికి బిఎల్ఆర్ ఆర్థిక సహాయం

**జయభేరి, ఉప్పల్ :**

మీర్ పేట్ HB కాలనీ డివిజన్ కి చెందిన మాల్యాల సరోజ టీచర్ క్యాన్సర్ తో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. షయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు BRS నాయకుడు గుమ్మడి జంపాల్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ--- బండారి లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ HB కాలనీ డివిజన్ మహిళ ప్రెసిడెంట్ పర్వీన్, రమేశ్, కాలనీ ప్రెసిడెంట్ కత్తుల రాజ్ కుమార్, భారతి, గడ్డం అంజయ్య, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**జయభేరి, అక్టోబర్ 4 :**

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు.మందాయి పల్లి గ్రామానికి చెందిన తాడం ఆంజనేయులు (40) టీఎస్ 08 జేజీ 5362 నంబరు గల యాక్టివా వాహనం పై తూంకుంట నుంచి పోతాయిపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. అదే మార్గంలో పోతాయిపల్లి గ్రామానికి చెందిన ప్రదీప్ (31) టీఎస్ 10 సీఏటీఆర్ 0227 నంబర్ గల బొలెరో వాహనాన్ని అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న తాడెం ఆంజనేయులు వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదం లో ఆంజనేయులు తలకి బలమైన రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

# సంస్కృతికి చిహ్నం బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలి

**జయభేరి, మేడ్చల్ :**

చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశ్యంతో సీఎం కేసిర్ బతుకమ్మ చీరల పంపిణీ చేయాలని సంకల్పించారని మంత్రి చామకూర మల్లారెడ్డి, కౌన్సిలర్ కౌడె మహేష్ కురుమ. మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సంస్కృతి చిహ్నమైన బతుకమ్మ పండుగను మహిళలందరూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ముందుగా ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ చీరలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు అధికారంలో ఉన్న పాలకులు ఏనాడు ప్రజలకు ముఖ్యంగా మహిళల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు, అంతే కాదు బతుకమ్మ చీరల పంపిణీ వెనుక గొప్ప ఉద్దేశం ఉందన్నారు.చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశ్యంతో సీఎం కేసిర్ బతుకమ్మ చీరల పంపిణీ చేయాలని సంకల్పించారని మంత్రి చామకూర మల్లారెడ్డి చెప్పారు. నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తూ, చేనేత కార్మికుల ఆకలి చావులకు అడ్డుకట్ట వేశామన్నారు. తెలంగాణ ఉద్యమంతో బతుకమ్మకు గుర్తింపు వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిరిసిల్ల చేనేత కార్మికులకు ఆకలి చావులు, వేలాది కుటుంబాలకు పనిలేక నేసిన దుస్తులు కొనేవారు లేక వారి జీవితాలు అస్తవ్యస్తంగా ఉండేవి, తెలంగాణ రాష్ట్రం వచ్చాక చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నది మంత్రి మల్లారెడ్డి తెలియజేస్తూ తదనంతరం కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ, విద్యార్థులకు, యువకులకు స్పోర్ట్స్ కిట్లు అందజేసిన మంత్రి మల్లారెడ్డి. ఈ సందర్భంగా కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ--- దేశంలోనే నిరుపేద కుటుంబాలకు పండుగలకు దుస్తులను అందించే తెలంగాణ రాష్ట్రం ఒక్కటే, ముఖ్యమంత్రి కెసీఆర్ దూర దృష్టి తో భారత దేశంలో పండుగ వస్తే కొత్త దుస్తులు ధరించని కుటుంబాలు ఉన్నాయి, మహిళలంతా పండగ వాతావరణం లో ఘనంగా బతుకమ్మ పండుగను జరుపుకోవాలని కోరుకుంటూ ముందుగా బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాసురాది భాస్కర్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ్మారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమీషనర్ టి ఎస్ వి ఎన్ త్రిలేశ్వర్ రావు, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్స్ జాకట దేవరాజ్, కౌడే మహేష్ కురుమ, తుడుం గణేష్, పెంజర్ల స్వామి యాదవ్, రామన్న, మణికంఠ గౌడ్, బత్తుల శివ కుమార్ యాదవ్, పానుగంటి సుహాసిని, మర్రి శ్రీనివాస్ రెడ్డి, జంగా హరికృష్ణ యాదవ్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, నడికొప్పు ఉమా నాగరాజు ముదిరాజ్, నారెడ్డి కృష్ణవేణి, రవీందర్ రెడ్డి, సాటే మాధవి నరేందర్ వంజరి, కో ఆప్షన్ సభ్యులు ఆకిటీ నవీన్ రెడ్డి, ఆరె గీత, మహమ్మద్ మహబూబ్ ఆలీ, మేడ్చల్ పట్టణ మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహ్మారెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, పార్టీ నాయకులు ఉదండపురం సత్యనారాయణ, నారెడ్డి రవీందర్ రెడ్డి, నడికొప్పు నాగరాజు ముదిరాజ్, పానుగంటి రవీందర్, మోహన్ రెడ్డి, లవంగు శైలేందర్ వంజరి మేడ్చల్ మున్సిపల్ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు మేడ్చల్ పట్టణ పుర ప్రముఖులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.






**ఉప్పల్ లో రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ తో కలిసి సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే సుభాశ్ రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.**

**జయభేరి, ఉప్పల్ :**



# గం..గం..గణేశా బృందావనివే..


"బేబి" సినిమా బ్లాక్ బస్టర్ హిట్ తో హ్యాపీగా ఉన్న ఆనంద్ దేవరకొండ...అదే ఉత్సాహంలో "గం..గం..గణేశా" మూవీతో మరో హిట్ అందుకునేందుకు రెడీ అవుతున్నారు. యాక్షన్ కామెడీ జానర్ తో "గం..గం..గణేశా" సినిమాను హైలైఫ్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. "గం..గం..గణేశా" సినిమా నుంచి బృందావనివే లిరికల్ సాంగ్ ను స్టార్ హీరోయిన్ రశ్మిక మందన్న రిలీజ్ చేసింది. ఆనంద్ గత సూపర్ హిట్ ఫిల్మ్ "బేబి"లోని ప్రేమిస్తున్నా సాంగ్ కూడా రశ్మికనే విడుదల చేసింది. ఆ సాంగ్ కంటే బృందావనివే పాట బిగ్ హిట్ కావాలని రశ్మిక బెస్ట్ విశెస్ తెలియజేసింది. తమ సినిమాలోని పాట రిలీజ్ చేసిన రశ్మికకు థాంక్స్ చెప్పారు హీరో ఆనంద్ దేవరకొండ. బ్యూటిఫుల్ మెలొడీ సాంగ్ బృందావనివే మీకు నచ్చుతుందని ఆయన ట్వీట్ చేశారు. చేతన్ భరద్వాజ్ కంపోజ్ చేసిన బృందావనివే పాటకు వెంగి సుధాకర్ లిరిక్స్ అందించారు. సిధ్ శ్రీరామ్ తో కలిసి చేతన్ భరద్వాజ్ ఈ పాట పాడారు. 'బృందావనివే యవ్వనివే నీవే, నా మనసే నీ వశమే రా, ప్రేయసివే ఊర్వశివే నీవే, ఆరాధనమైనావే...' అంటూ మంచి లవ్ ఫీల్ తో బ్యూటిఫుల్ మెలొడీగా ఆకట్టుకుంటోందీ పాట. "గం..గం..గణేశా" త్వరలో థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నటీనటులు : ఆనంద్ దేవరకొండ,ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక, వెన్నెల కిషోర్, జబర్దస్త్ ఇమాన్యూయల్,సత్యం రాజేష్,రాజ్ అర్జున్ తదితరులు.





# అదే అసలైన శిక్ష

ఎస్తర్, శృతి శరణ్, అవయుక్త, వంశీ పాండ్య ప్రధానపాత్రధారులుగా, చంటి గానమని దర్శకత్వంలో వెంకటేశ్ చిక్కాల నిర్మిస్తున్న 'లేతాకులు' చిత్రం షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి వకుళాభరణం కృష్ణమోహన్‌రావు క్లాప్ ఇవ్వగా, మోహన్ వడ్లపట్ల కెమెరా స్విచాన్ చేశారు. తమ్ముడు సత్యం స్క్రిప్ట్ అందించగా, వి.వి.సముద్ర గౌరవ దర్శకత్వం వహించారు. ఇండియన్ హిస్టరీలో ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని, ముఖ్యంగా మహిళలకు బాగా నచ్చే కథ ఇదని, ఎస్తర్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, దసరా తర్వాత రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని నిర్మాత చెప్పారు. మనల్ని ఎవరైనా బాధపడితే, మనం పడిన బాధ వాళ్లకు కూడా కలిగేలా చేయడం అసలైన శిక్ష. ఈ నేపథ్యంలో కథ ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు కెమెరా: మురళీమోహన్‌రెడ్డి, సంగీతం: సుక్కు.




# మస్తుగా ఉరుకుతాంది

'ఉడతా ఉడతా హుష్షా హుష్.. సప్పుడు సేయకుర్రీ.. నీ కన్నా మస్తుగ ఉరుకుతాంది మా సిట్టి సిన్నారీ..'. పాట అదిరింది కదూ. బాలకృష్ణ 'భగవంత్ కేసరి' సినిమాకోసం తెలంగాణ భాష, యాసలోని సోయగమంతా వినిపించేలా అనంతశ్రీరామ్ రాసిన పాట ఇది. తమన్ స్వరాలందించగా, యస్.పి.చరణ్ ఆలపించారు. ఈ పాటను బుధవారం విడుదల చేశారు. చిత్రీకరణ చూస్తుంటే 34ఏళ్ల క్రితం బాలకృష్ణ 'ముద్దులమావయ్య' సినిమాలోని 'మామయ్య అన్న పిలుపు.. మా ఇంట ముద్దులకు పొద్దుపొడుపు' పాట గుర్తొస్తున్నది. కాకపోతే చిన్న మార్పు.. అక్కడ చెల్లెలు, ఇక్కడ కూతురు అంతే తేడా. బాలయ్య బాబాయిగా, శ్రీలీల కూతురుగా ఒదిగిపోయి నటించారీ పాటలో. ఈ పాటను బట్టి సినిమాలో ఎమోషన్స్‌కి కొదవుండదని అర్థమవుతున్నది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానున్న విషయం తెలిసిందే.



# ఆ ఫీలింగ్ తెచ్చే ఆనందం మామూలుగా ఉండదు

'తెలుగు సినిమాపై సీత కన్నేశారేంటి? అని ఇటీవల తాప్సీని ఓ తెలుగు అభిమాని అడిగితే – 'నేనేం చెయ్యను. సరైన అవకాశాలు రావడంలేదు. అడపాదడపా వచ్చినా కథలేమో నచ్చట్లేదు. కథలు నచ్చకపోతే సినిమాలు చేయను' అంటూ నిర్మొహమాటంగా సమాధానమిచ్చేసింది తాప్సీ. అన్నీ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తున్నారు. కమర్షియల్ హీరోలతో మాస్ సినిమాలు చేయరా? అనడిగితే 'దీనికీ అదే నా సమాధానం. అవకాశాలు రావడంలేదు. వస్తే చేయటానికి అభ్యంతరం ఏముంటుంది? కాకపోతే నా వరకు ఆర్టిస్టుగా చిన్న సినిమాలే హాయిగా ఉన్నాయి. మీకు తెలియదనుకుంటా. నా సినిమాలకు తగ్గట్టే నా పారితోషికం కూడా ఉంటుంది. డబ్బు తక్కువ వచ్చినా అలాంటి సినిమాల్లో చేయటం వల్ల ఆత్మ సంతృప్తి ఉంటుంది. ఎందుకంటే అక్కడ అన్నీ నేనే. నా చుట్టూనే కథ తిరుగుతుంది. నాకోసమే ప్రేక్షకులు థియేటర్‌కి వస్తారు. ఈ ఫీలింగ్ తెచ్చే ఆనందం మామూలుగా ఉండదు' అంటూ తన మనసును ఆవిష్కరించింది తాప్సీ.

# మాన్షన్‌లో ఏం జరిగింది ?

వరలక్ష్మీ శరత్‌కుమార్, అవికాగోర్, బిందు మాధవి, నందు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'మాన్షన్ 24'. ఓంకార్ దర్శకత్వం వహిస్తున్నారు. డిస్నీ హాట్‌స్టార్‌లో ఈ నెల 17 నుంచి స్ట్రీమింగ్ కానుంది. బుధవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఓంకార్ మాట్లాడుతూ 'ఈ సిరీస్‌లో ఆరు ఎపిసోడ్స్ ఇంట్రెస్టింగ్‌గా సాగుతాయి. ప్రతి ఎపిసోడ్ సరికొత్త పాయింట్‌తో ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీ అంతా చూసేలా ఉంటుంది' అన్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'హారర్ థ్రిల్లర్ కథాంశమిది. నా క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న సిరీస్‌లో భాగం కావడం ఆనందంగా ఉంది' అని చెప్పింది.

**డ్రగ్స్ కేసుతో సంబంధం లేదు**

ఇదే కార్యక్రమంలో తనపై వచ్చిన డ్రగ్స్ కేసు గురించి మాట్లాడింది వరలక్ష్మీ శరత్‌కుమార్. మాదక ద్రవ్యాల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ నుంచి తనకు నోటీసులు అందాయన్న ప్రచారంలో వాస్తవం లేదని వరలక్ష్మీ శరత్‌కుమార్ స్పష్టం చేసింది. 'గతంలో ఆదిలింగం అనే వ్యక్తి నా దగ్గర ఫ్రీలాన్స్ మేనేజర్‌గా పనిచేశారు. ఆయన తీసుకొచ్చిన నాలుగు చిత్రాల్లో నటించా. అంతేకానీ అతని వ్యక్తిగత జీవితం గురించి నాకు ఏమీ తెలియదు. డ్రగ్స్ కేసులో ఆయన ఉన్నారంటూ వార్తలొచ్చాయి. దాంతో కొందరు నా ఫొటోను వాడుకొని కథనాలు రాశారు. అంతేతప్ప డ్రగ్స్ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు' అని వరలక్ష్మీ శరత్‌కుమార్ పేర్కొంది. 'మాన్షన్ 24' సిరీస్‌కు సంగీతం: వికాస్ బాడిస, నిర్మాతలు: ఓంకార్, అశ్విన్ బాబు, కల్యాణ్ చక్రవర్తి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com